# కలల ప్రపంచం

-పోట్లూరు సుబ్రహ్మణ్యం

ఆరోజు సాయంత్రం నాలుగు గంటలప్పుడు మా ఇంటి ముందు ఓ పడవలాంటి కారు ఆగింది. అందులోంచి దిగిన ఓ ఇద్దరు యువకులు నాకు నమస్కరించి, 'మా ఊళ్లో మీకు గొప్ప సాహితీ సన్మానం ఏర్పాటు చేశాం సార్. మీరు వెంటనే బయలు దేరండి' అనేసరికి నేను సంతోషంతో పొంగిపోయాను. అరగంటలో తయారై వాళ్లు వచ్చిన ఏ/సి కారులో కూర్చున్నాను.

కారు బయలుదేరింది. ముందు సీట్లో డ్రైరు ప్రక్కన ఆ ఇద్దరు యువకులు కూర్చుంటే, విశాలమైన వెనుకసీట్లో జారగిలబడి కూర్చున్నాను. ఏ/సి చల్లదనానికి, వేగంగా సాగిపోతున్న కారు యొక్క మెత్తని కుదుపులకు నాకు తెలియకుండానే నిద్రలోకి జారిపోయాను.

నేను మెలుకువ వచ్చి చూసేసరికి అప్పుడే ఉదయపు చీకట్లు విడిపోతున్నాయి. కాని కారు అదే వేగంతో ముందుకు పోతూ ఉంది. అంటే రాత్రి తెల్లవార్లూ నేను ప్రయాణం చేస్తూనే ఉన్నానన్నమాట. నిన్న సాయంత్రం చేస్తారనుకొన్న సన్మానం ఈ రోజు సాయంత్రం చేస్తారన్నమాట. అప్పుడు ముందు సీట్లోని ఇద్దరు యువకులు నిద్రపోతున్నారు.

కొద్దిసేపటికి కారు అందమైన ఒక పెద్ద నగరంలో ప్రవేశించింది. ఆ నగరం నేను ఎప్పుడూ చూళ్లేదు. నేమ్‌బోర్డుల కోసం వీధుల్లో వెతికాను. ఎక్కడా కనిపించలేదు. కారు వెళ్లి ఓ పెద్ద బంగళా ముంది ఆగింది. ఇద్దరు యువకులు మేల్కొన్నారు. డ్రైవరు కారు దిగివచ్చి గౌరవసూచికంగా డోరు తీసి పట్టుకున్నాడు.

నేను దిగిదిగగానే "రచయిత కోటిలింగం గారికి జిందాబాద్" అంటూ పెద్దపెద్ద దండలు నా మెడలో వేసారు అక్కడ గుమిగూడి ఉన్న పెద్దలు.

నేను తమ నగరానికి రావడం వాళ్లకెంతో ఆనందం కలిగించిందని చెప్పి ఒకరొకరుగా నాకు అభినందనలు చెప్పి వెళ్లిపోయారు.

చివరగా నన్ను ఆహ్వానించిన వాళ్లలో ఒక యువకుడు, "చూడండి మహానుభావా, మీరు మా అతిథులు. కొన్ని రోజులపాటు మీరీ గెస్టుహౌసులో ఉండాలి. ఇక్కడి మీకేమీ కొరతరాదు. నౌకర్లు, కారు అన్నీ మీ ఆధీనంలో ఉంటాయి" అంటూ లోపలికి తీసుకెళ్లి ఇల్లంతా తిప్పి చూపాడు. నౌకర్లు అంతా వంగివంగి దణ్ణాలు పెట్టారు. నాకు కొత్త ప్రపంచంలో అడుగుపెట్టినట్టుగా ఉంది.

నన్ను చివరగా ఒక అద్దాల గదిలోకి తీసుకువెళ్లి, "ఇది మీ ఆఫీసు రూము. ఈమె మీ పర్సనలు సెక్రటరీ ప్రభావతి. మీ విషయాలన్నీ చూస్తుంది" అంటూ మోకాళ్లపైకి పొట్టి గౌనులో బాబ్డ్‌హెయిర్‌తో నిలబడి వున్న ఓ ఇరవై ఏళ్ల అమ్మాయిని చూపించాడు.

ఆ అమ్మాయి తెల్లగా, అందంగా, బొద్దుగా, ముద్దుముద్దుగా ఉంది. దొండ పండులాంటి ఎర్రని పెదాలు తడితో మెరుస్తుండగా వాటిని మెల్లగా విడదీసి విశాలమైన నల్లని కాటుక కన్నులతో నావైపు వింతగా చూస్తూ "గుడ్ మార్నింగ్ సార్" అంది.

నేను మిడిగుడ్లు వేసుకుని చూస్తున్న వాడల్లా ఈ లోకంలోకి వచ్చి, "యస్... యస్... మార్నింగ్" అంటూ జవాబిచ్చాను.

వచ్చినతను వెళ్లిపోయాడు. ఇక నా బాధ్యతలన్ని నా సెక్రటరీ ప్రభావతి తీసుకుంది. నౌకర్లను పురమాయించి నాకు అన్ని ఏర్పాట్లు చేసింది. నేను బాత్‌రూములోకి వెళ్లి హాట్ వాటర్‌తో స్నానం చేసి వచ్చేసరికి డైనింగు హాల్లో టిఫిను రెడీ చేసింది.

టిఫిన్ అయిన తరువాత బెడ్‌రూముకు వెళ్లి కొద్దిసేపు పడుకున్నాను. నేను లేచేసరికి పన్నెండు అయింది. గది వాకిట్లో చిరునవ్వుతో నిలబడి ఉంది ప్రభావతి. మళ్లీ ముఖం కడుక్కుని డైనింగు హాలులోకి వెళ్లేసరికి వేడివేడి పదార్థాలు వడ్డించింది వంట మనిషి అనసూయ. తృప్తిగా తిన్నాను. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాను. నాకెదురుగా నా సెక్రటరీ ప్రభావతి కూర్చుని కొద్దిసేపు కబుర్లు చెప్పింది. ఆ మహానగరాన్ని గురించి, అక్కడి వింత, విశేషాల గురించి చాలాసేపు చెప్పింది. ఆమె మధురమైన మాటలు వింటూ చాలాసేపు మైమరచి పోయాను.

"మీరు విశ్రాంతి తీసుకోండి. సాయంత్రం అయిదు

గంటలకు రెడీ అయి ఉండండి. మనం సిటీలోకి వెళ్లాం..” అంటూ వీడ్కోలు తీసుకుని ఆఫీసు రూము వైపు వెళ్లిపోయింది.

'నా సన్మానం సంగతి' అనబోయి, తమయించు కున్నాను అది సభ్యత క దని.

నేను నా గదికి వెళ్లి నాలుగు గంటల వరకూ నిద్రపోయాను. నాలుగు గంటలకు లేచి స్నానం గట్రా పూర్తిచేసి అయిదు గంటలకల్లా డ్రెస్ చేసుకొని రెడీగా ఉన్నాను.

“గుడ్ ఈవెనింగ్ సార్” అంటూ వచ్చి విష్ చేసింది ప్రభావతి. ఇప్పుడు డీసెంటుగా చీర కట్టుకొని ఎంతో అందంగా ఉంది.

తరువాత మేము బయటికి వచ్చేసరికి ఆరోజు ఉదయం నేను వచ్చిన కారు మా కోసం రెడీగా ఉంది. డ్రైవరు విష్‌చేసి కారు డోరు తీసాడు. నేను లోపలికి వెళ్లి వెనుక సీట్లో కూర్చున్నాను.

ప్రభావతి వచ్చి నా ప్రక్కనే కూర్చుంది. ఆమె శరీరం మీద నుంచి వచ్చే సెంటు వాసనలు ఘుబాళిస్తున్నాయి. ఇద్దరం ఆ సాయంత్రం చాలా ఆనందంగా గడిపాము. ఆ నగరంలో ప్రసిద్ధి చెందిన ఫ్లవర్ గార్డెన్ చూపించింది. అక్కడ నన్ను చాలామంది విష్ చేసి పలుకరించారు. తరువాత సీషోర్‌కి వెళ్లాము. అక్కడ సముద్రపు చల్లని గాలిని పీలుస్తూ ఇద్దరమూ చాలా దూరం నడిచాము. ప్రభావతి తన చీరను ముంగాళ్లపైకి ఎత్తిపట్టి సముద్రపు అలల నురుగమీద తన తెల్లని పాదాలు మోపుతూ నడుస్తోంది.

“నమస్తే సార్”

“బాగున్నారా”

“ఎన్నాళ్లకు చూశాము సార్”

ఇలా మా కెదురొచ్చిన ప్రతి ఒక్కరూ నన్ను పలుకరిస్తున్నారు. నేను ఎంతో ఆశ్చర్యపోతున్నాను. నేను పేరున్న రచయితనే. అయితే ఎప్పుడూ నా ఫొటో పత్రికలలో పడలేదు. అయితే వీళ్లందరికీ నేనెలా తెలుసు? ఇదే విషయం సెక్రటరీ ప్రభావతి నడిగాను.

“మీరు ఈ ఊరికి కొత్తగదా సార్. అందులోనూ పెద్దవాళ్లు. అందుకని పలుకరించి ఉంటారు” అని, అంతలోనే ఆందోళనగా, “సార్ పొరపాటున కూడా మీరు ఈ నగరంలో ఒంటరిగా తిరగకండి. చాలా ప్రమాదం” అంటూ నన్ను హెచ్చరించింది.

ఆమె సమాధానం నాకేమాత్రం తృప్తికరంగా లేదు. నా పేరు ప్రతిష్ఠలు భరించలేక ఈర్ష్యతో అలా చెబుతుందనుకున్నాను. అప్పటికి మౌనంగా ఉన్నాను.

మేము ఆ రాత్రి ఇంటికొచ్చేసరికి ఎనిమిదయింది. నేను స్నానంచేసి భోంచేసేసరికి తొమ్మిది అయింది. గదికి వెళ్లి డబుల్‌కాట్ బెడ్‌మీద ఉన్న రెండు పిల్లోలను ఒకదాని మీద ఒకటి వేసి దానికి ఆనుకొని కూర్చుని జరిగిన విషయాలన్నీ ఆలోచిస్తున్నాను. కాని ఎంత ఆలోచించినా ఈ నగరం మిస్టరీ అర్థం కావడంలేదు. నగరమంతా చిరపరిచితంగా ఉంది. ఇక్కడి వ్యక్తుల్ని ఎక్కడో చూసినట్లుగా ఉంది. దానికి తగ్గట్లు కనిపించిన ప్రతి వ్యక్తీ పలుకరిస్తూనే ఉన్నాడు. ఈ మిస్టరీ ఛేదించాలంటే నేను ఒంటరిగా వెళ్లాలి. నన్ను పలుకరించిన ప్రతివాడితోనూ మాట్లాడాలి. అప్పుడు గాని ఈ మిస్టరీ ఛేదింపబడదు అనుకున్నాను.

ooo

ఉదయం బద్ధకంగా నిద్రలేచాను. అప్పటికే ప్రభావతి వెళ్లిపోయింది. నేను స్నానం చేసి వచ్చేసరికి ఫ్రెష్‌గా అప్పుడే వికసించిన గులాబీలా తయారైన ప్రభావతి నన్ను విష్ చేసింది. చిరునవ్వుతో డైనింగు టేబులు దగ్గరకు ఆహ్వానించింది.

టిఫిను అయిన తరువాత తిరిగి నా గదిలోకి వెళ్లి కూర్చున్నాను. తినడం, పడుకోవడం, తిరగడం.. ఇలా నాలుగు రోజులు గడిచాయి. నాకేం అంతుబట్టడంలేదు. సన్మానం సంగతి అటుంచి, సన్మానం చేస్తామని తీసుకొచ్చినవాళ్లూ కూడా అంతులేరు. ఒంటరిగా బయటికి వెళ్దామంటే వీలుకావడంలేదు.

## కౌలకలి

కన్నీటి విలువ కరిగి నీరై
ప్రవహించే నీటి బిందువులకేం
తెలుసు అవి అభిమానపు
ఆణిముత్యాలని
సహజ సుందర స్వాతిముత్యాలని
పరస్పర అవగాహనా బంధాలని
భావావేశ తుది మెరుపులని
ఆనందానికి పరాకాష్టలనీ

–డా॥ జరీనా బేగం

ఆ రోజు నాకు మంచి అవకాశం దొరికింది. నౌకర్లు ఎవరి పనుల్లో వాళ్లున్నారు. నా పర్సనల సెక్రటరీ ప్రభావతి ఆఫీసు రూములో ఏదో టైపు చేసుకొంటూ ఉంది. ఇదే సమయమనుకున్నాను. మెల్లగా అడుగులు వేస్తూ బయటికి వచ్చాను.

గూర్ఖా కూర్చునే కళ్లు మూసుకుని ఏదో ఆలోచిస్తున్నాడు. సగం తెరచిన గేటులోంచి మెల్లగా బయట పడ్డాను.

నేను మెల్లగా వీథిలోకి నడిచాను. రోడ్లన్నీ నాకు తెలిసిన ప్రదేశాల్లా ఉన్నాయి. నగరంలోని ప్రతి అంగుళమూ నాకు బాగా తెలిసినట్లు, చిరపరిచితంగా ఉన్నాయి. దూరంగా రోడ్డుకు కుడివైపున 'రమణ కాఫీ హోటలు' కనిపిస్తూ ఉంది. మెల్లిగా ఆ హోటల్లో దూరాను. ప్రొప్రయిటర్ నా వైపు చూసి చిరునవ్వుతో 'వణక్కం సార్' అన్నాడు. 'అరె... ఇతను త్రిలింగం... ఇక్కడెందుకున్నాడు' అనుకున్నాను. అయితే ఇతనెక్కడ నాకు పరిచయమయ్యాడు? ఎంత ఆలోచించినా నాకు అర్థం కావడంలేదు. రచయితలకు మతిమరుపంటారు. అయినా నాకు మరీ ఇంత మతిమరుపా?

నేను ఒక టేబులు ముందు కూర్చున్నాను. రెండిడ్లీ ఒక వడ, కొబ్బరి చెట్నీతో సర్వర్ చక్రం నా ముందు టిఫిను ప్లేటు పెట్టి, "మసాలా దోశె ఆల్రెడీ చెప్పేసాను సార్" అన్నాడు నా వైపు చిరునవ్వుతో చూస్తూ.

'అరె. నేను టిఫినుకు ఆర్డరివ్వక ముందే నేను సాధారణంగా తినే టిఫిన్ తెచ్చి పెట్టాడు. అదీగాక నేను ఇడ్లీవడ తరువాత ఖచ్చితంగా మసాలా దోశె తింటాను. హైదరాబాదులో నేను వాడుకగా వెళ్లే హోటల్లో నేను ఆర్డరివ్వక ముందే సర్వర్లు టిఫిన్ నా టేబులు మీద పెట్టేస్తుంటారు. అలాంటిది వీడు ఈ చక్రంగాడు. అన్నీ తెలిసినట్లే పెట్టాడు. అసలు ఈ చక్రం సర్వరుగా నాకు తెలుసుగాని, వీడెక్కడ పనిచేస్తూ ఉండేవాడో నాకు గుర్తుకొచ్చి చావడంలేదు. హైదరాబాదులో మాత్రం కాదని ఖచ్చితంగా చెప్పగలను.

టిఫిన్ తింటూంటే చాలామంది నన్ను పలుకరించారు. 'హలో కోటిలింగం గారూ. బాగున్నారా' అని కొంతమంది, 'ఎప్పుడొచ్చారీ వూరికి' అని మరికొంతమంది పరామర్శించారు.

అందరూ నాకు చిరపరిచితులే. అందరి పేర్లూ గుర్తున్నాయి. కాని వాళ్లు ఎవరు? ఎలా పరిచయమయ్యారన్నదే అర్థం కావడంలేదు. టిఫిన్ పూర్తిచేసి మళ్లీ రోడ్డుమీదికి వచ్చాను.

'అరె.. ఈ ఊళ్లో బ్రిడ్జి అవతల నెహ్రూ మ్యూజియం ఉండాలి గదా' నాలో నేను అనుకున్నాను. అది ఇక్కడికి రెండుమైళ్ల దూరంలో ఉంది. నడవగలనా అని అనుకుంటుండగానే రిక్షా బెల్ గణగణలాడించుకుంటూ నా ముందు రిక్షా ఆపాడు రిక్షావాలా.

పరీక్షగా చూశాను. సన్నగా ఎండిపోయి ఉన్నాడు. పొట్ట వెన్నుకు అంటుకుపోయి ఉంది. చిన్నపిల్లలు చూస్తే పిశాచమనుకొని జ్వరాన పడేట్లు ఉన్నాడు. వీడు.. వీడు.. పోతురాజు.. ముమ్మాటికీ పోతురాజే.

"నువ్వు పోతురాజువి కదూ.."

"అవును సామే. నా పెళ్లాం పేరు ఎంగటి. నాలుగిళ్లలో పాసిపన్లు చేస్తుంది. తమరింకా గుర్తుపెట్టుకున్నారా సామే" అన్నాడు పోతురాజు కళ్లు తుడుచుకుంటూ. రాయలసీమ బావుల్లా ఎండిపోయిన కళ్లనో నీరెక్కడివి?

"ఎక్కండి సామే" అన్నాడు పోతురాజు.

"నీకు టి.బి. కదట్రా. నువ్వు తొక్కగలవా?"

## మాయాకాలం

రామాయణ కాలంలో
ఒక్క స్త్రీని చెఱ బట్టితే
అరివీర భయంకరుడా రావణాసురుడి
దశ కంఠాలు తెగిపడ్డాయి ఒక్కవేటున
లంకా పురిలో నిశ్శేషంగా
భారత కాలంలో
ఒక్క ఆడదాన్ని అవమానిస్తే
ఘనయోధులు సుయోధనాదుల
శత శిరస్సులు రాలిపడ్డాయి రణభూమిలో
నిశ్శేషంగా
మరేమిటిది మాయకాలం
మదమెక్కిన మానవాధములీనాడు
మైనర్ బాలికను మానభంగం చేసినా
మనగల్గుతున్నారు మధాందుల మద్దతుమాటున
నిక్షేపంగా..

**-కె. రత్నకుమారి**

"ఆ.. దాందేముంది సామే. మాలోంటోళ్లకి జబ్బులొకపక్క వస్తానే ఉంటాయి. మరోపక్క పనిచేస్తనే ఉంటం. లేకపోతే కూడెట్టాసామే" అన్నాడు వేదాంత ధోరణిలో.

నేను రిక్షాలో కూర్చున్న తరువాత రిక్షా లాగుతూ తన సోదంతా వెళ్లబోసుకున్నాడు. తనకు టి.బి. తగ్గలేదట. తన భార్య కడుపు నొప్పితో బాధపడుతుందట.

"ఈ సంసారంతో నేనింక ఏగలేను సామే" అన్నాడు వాడు నిరాశగా...

"నీ మొదటి పెళ్లాం లక్ష్మే గనుక ఉండుంటే నీకు ఇన్ని బాధలుండకపోనురా" అన్నాను ఓదార్పుగా.

"అవును సామే. ఆ ఆటోడ్రయివరు నా కొడుకు దాన్ని మాయజేసి తీసుకెళ్లకుంటే నా బ్రతుకిట్లా ఉండేది కాదు" అంటూ విచారపడ్డాడు.

నేను మ్యూజియం దగ్గర దిగి వాడికి పది రూపాయలు రిక్షా బాడుగ ఇవ్వబోతే వాడు తీసుకోలేదు. బలవంతం మీద వాడి చేతిలో పెట్టాను.

మ్యూజియంలోకి వెళ్లాను. అక్కడ కూడా చాలామంది పలుకరించారు. అక్కడనుంచి గాంధీ పార్కుకి వచ్చి చల్లని చెట్లనీడన సిమెంటు బెంచీ మీద కూర్చున్నాను.

ఇంతలో బఠాణీలు అమ్ముతూ వచ్చాడు రంగడు. "ఏరా రంగా, బాగున్నావా?" అన్నాను.

"ఎవురో అనుకున్నాను. తమరా సామే. ఏదో ఇట్టా ఉన్నా. ఎదుగూ బొదుగూ లేని ఎదవ బ్రతుకు బ్రతుకుతున్నా" అన్నాడు నాకెదురుగా క్రింద చతికిలబడి కూర్చుంటూ.

వాడి కొంపలో సంగతులు ఏవేవో చెప్పుకొచ్చాడు. వాడి పెళ్లాం వాడి మాట వినదట. వాళ్ల అమ్మ ఎంత చెబితే అంతేనట. ఇదంతా తాను ఇల్లరికం పోవడం వల్లనే జరిగిందని, సాయంత్రం ఒకసారి ఇంటికొచ్చి మధ్యస్తం చేసి పొమ్మన్నాడు. 'అలాగే' అని సమాధానమిచ్చాను.

ఆ పార్కులో వీచే చల్లగాలికి హాయిగా నిద్రపట్టింది. సాయంత్రం నాలుగు గంటలకు గాని మెలుకువ రాలేదు. మధ్యాహ్నం భోజనం లేకపోవడంతో కడుపులో మంటగా ఉంది. లేచి కొద్దిదూరంలో ఉన్న పంపు దగ్గర చల్లని నీళ్లతో ముఖం కడుక్కున్నాను.

ఆ సమయంలో భోంచేయడానికి హోటళ్లుండవు. నేను దిగిన గెస్ట్‌హౌస్‌కు వెళ్లాలంటే చాలా దూరం. అందుకే పార్కు నుంచి బయటపడి పక్కనే ఉన్న హోటల్లో కాఫీ తాగి ఒక సందులోంచి వస్తున్నాను. ఆ సందులో ప్రతి ఇంటిముందూ ఆడవాళ్లు నిలబడి ఒకరితో ఒకరు పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.

నేను ఒక ఇంటిముందు కొచ్చేసరికి ఆ ఇంటిముందున్న రంభలాంటి స్త్రీ గబగబా నా దగ్గరకు వచ్చి నా చేయి పట్టుకుంది.

"రండి, లోపలికి వెళ్దాం" అంది.

అంతే. అక్కడున్న ఆడవాళ్లు నన్ను చుట్టుముట్టారు. నాకు చాలా ఆశ్చర్యమనిపించింది. దాంతోబాటు అది నేనెరిగిన వేశ్యావాటిక అని కూడా అర్థమయింది. మొదట నా చేయి పట్టుకున్నామె పేరు జయంతి.

ఇలా వేశ్యలంతా నా మీద పడేసరికి వాళ్లని తప్పించుకొని జయంతి వెంట ఇంట్లోకి నడిచాను. జయంతి చల్లని మజ్జిగ ఇచ్చి నన్ను మెత్తని పరుపు మీద పరుండబెట్టి కాళ్లు ఒత్తసాగింది.

"జయంతీ, నాకు ఇలాంటివి అలవాటు లేదు" అన్నాను శాంతంగా.

"నాకు మాత్రం అలవాటుందా. కోటిలింగం సార్. మొగుడు వదిలి, ఈ సంఘంలో విషజంతువుల్లాంటి పురుషుల మధ్య బ్రతకలేకుంటే మీరిచ్చిన సలహాయే గదా ఇది."

నా నోట్లో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. నా అస్త్రం నా మీదే తిప్పి కొట్టింది. ఇంకేం మాట్లాడగలను. కొద్దిసేపుండి మెల్లిగా ఆమెను వదిలించుకొని అక్కడ నుంచి బయటపడి నాకు కేటాయించిన గెస్ట్‌హౌస్ వైపు నడుస్తున్నాను. ఇప్పుడు నా మెదడు తీవ్రంగా ఆలోచిస్తోంది. ఇదంతా ఏమిటి? ఏదో ఉంది. అదేమిటి? నా మెదడు తర్జన భర్జనల మధ్య జ్ఞానదీపం వెలగబోతోంది.

ఈ లోపల గేటు ముందుకు వచ్చాను. గూర్ఖా తలుపు తీసి ''రండి సార్'' నవ్వుముఖంతో ఆహ్వానించాడు.

అతన్ని బాగా పరిశీలించి చూశాను. ఆ నవ్వు ముఖం వెనుక విషపు ఆలోచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వాడి కళ్లలో ప్రతీకారేచ్ఛ వెలుగుతోంది.

దాని వెనుక కథ తెలుసు. అదేమిటంటే నా

సెక్రటరీకి వీడికి శారీరక సంబంధం ఉంది. వీళ్లిద్దరు వేసుకున్న ప్లాను ప్రకారం రాత్రి నా గదికి వచ్చిన నా సెక్రటరీ ప్రభావతి పాలల్లో విషం కలిపి ఇవ్వబోతోంది. ఫలితంగా నా చావు. వాళ్ల ప్రేమ సఫలం.

అందుకే మళ్లీ వస్తానని చెప్పి వెనుకకు తిరిగాను. ఇప్పుడు నా కంతా స్పష్టంగా అర్థం కాసాగింది. అదేమిటంటే ఇప్పుడు కనిపించిన వ్యక్తులందరూ నా నవల్లోని పాత్రలు. నా నవలలలోని పాత్రలంతా ఒకచోట చేరి నన్నీ నూతన నగరానికి ఆహ్వానించాయన్నమాట. అందుకే అందరూ నాకు తెలిసినట్లుగా ఉంది.

నే వ్రాసిన 'సెక్రటరీ ఇన్ సీక్రెట్ లవ్'లోని పాత్రలు సెక్రటరీ ప్రభావతి. గూర్ఖా జయసింగు. వీళ్లు హీరోని పాయిజనిచ్చి చంపి అతని సంపదతో పారిపోతారు.

ఇకపోతే హోటలు ప్రొప్రయిటరు 'గ్రేట్ థెఫ్ట్ ఇన్ ఎ స్మాల్ హోటల్' నవలలోని ప్రొప్రయిటరు. రిక్షావాలా పోతురాజు 'బీదల బ్రతుకుల్లో బాధల సుడిగుండాలు' నవలలోని పాత్ర. పార్కులో బఠాణీల రంగడిది, 'సంఘంలో స్వయం ఉపాధన'లోని పాత్ర.

నేనిప్పుడు ఎలాగో గెస్ట్‌హౌస్ నుంచి చావు తప్పించుకుని బయటపడ్డాను. అయితే ఈ నగరం నుంచి బయటపడి నా నివాస స్థానం చేరుకోవాలి. ఎలా?

ఆలోచనల్లోంచి తలెత్తి చూసేసరికి ఎదురుగా ఐదుగురు రౌడీలు నిలబడి ఉన్నారు. వారిలో మధ్యనున్నవాడు ఎర్రని గుడ్డ తలకు చుట్టి ఉన్నాడు. శరీరం మీద చొక్కాలేదు. నల్ల డ్రాయరుతో ఉన్నాడు. వాడు నా క్రైం నవల 'పట్నంలో పత్తేదారు'లోని విలన్. నేనేదో మాట్లాడేలోగా వాడి చేతిలోని కర్ర నా నెత్తిమీద 'టప్'మని పడింది.

○○○

పెద్దగా అరుస్తూ కళ్లు తెరిచాను. అంతా కల. ఒక సైకలాజికల్ ఇల్యూజన్. ఏదయితే నేం? నేను సృష్టించిన పాత్రల మానసిక వేదన, కష్టసుఖాలు అర్థమయ్యాయి. నవలల్లోని పాత్రల్ని కూడా హింసాయుతంగా సృష్టించకూడదని, వాళ్ల జీవిత సమస్యల్ని సానుభూతితో పరిశీలించి చక్కటి పరిష్కార మార్గాన్ని చూపించాలని నాకిప్పుడు అర్థమయింది. ■

## తిమిరం నుండి తమస్సుకు

నాకు బొడ్డు తెగింది స్వపక్షంలోనే
ఉట్టిగట్టి ఊరేగిందీ స్వపక్షంలోనే
ఎందుకో వివక్ష పక్షపాతిని నేను
విడదీయరాని అనుబంధాన్ని నేను
విపక్షానికి ప్రాణ రహస్యం చెప్పి
స్వపక్షానికి మరణం కొనితెచ్చాను
నా మరణం నాకు దుఃఖం
పాండవ పక్షపాతి భీష్ముడని
ప్రపంచానికి ప్రకటించాను!
నేల రాలిన అక్షౌహిణీని పరికించి
పైబడ్డ పరాజయానికి వగచి
అశ్వత్థామ లాంటి కుంజరాన్ని చంపి
ఆచార్య ద్రోణుణ్ణి హతమార్చాను
ఆపదలో బొంకటం
అధర్మం కాదనటం అలవర్చుకున్నాను!
పద్మవ్యూహం బద్దలు కొట్టి
మూకను చెండుతున్నప్పుడు
హితుడి మేలుకోరి
అభిమన్యుణ్ణి హతమార్చాను
మరణం వెంటబడ్డప్పుడు మనిషి
భుజం మార్చటం చూపాను!
నమ్మకం వమ్ముచేసి
అవమానం అవహేళనల మధ్య
వీర కర్ణుణ్ణి భీరుణ్ణి చేసి
విగతుణ్ణి చేసిన శల్యసారథ్యం నాటి
కటపం ఏ పక్షం వహించినా
విజయం వరిస్తుందని నిరూపించాను!
చీకట్లోంచి చీకట్లోకి ప్రవేశం కదా
ఇక రహదారులెందుకు
వాగ్దానాలెందుకు
విశ్వాసాలెందుకు?
అనుకున్నవి అనుకున్నట్టు
జరుగుతాయని అనుకుంటూ
ఆకాశంలోకి రాయి విసిరి నిద్రిస్తాను
అప్పుడే కథ మొదలౌతుంది
దుఃఖానికి దుఃఖం
జతకూడుతూ విడివడుతూ
ధర్మంలోకి అధర్మం
జొరబడుతూ కలబడుతూ–

–అడిగోపుల వెంకట రత్నమ్